క్లుప్తంగా

నేడు తంటికొండ వెంకన్న కల్యాణం

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం సోమవారం రాత్రి 7 గంటలకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని మండపంలో జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ దంపతులు పీటలపై కూర్చొని స్వామి వారి కల్యాణం జరపనున్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆదివారం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, కూతురుగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. స్వామి వారి కల్యాణానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఈఓ ఆర్వీ చందన తెలిపారు.

నేడు రాజలింగేశ్వరస్వామి కల్యాణం

గోకవరం: మండలంలోని కొత్తపల్లిలో రెడ్డిరాజుల కాలం నాటి బాలత్రిపురసుందరీ సమేత రాజలింగేశ్వరస్వామి కల్యాణం సోమవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణం సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సుమారు 300 సంవత్సరాల చరిత్ర ఉన్న ఆలయంలో కొలువైన స్వామి, అమ్మవార్లకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు.

జోరుగా సేవా కార్యక్రమాలు



చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న స్పార్క్ ప్రతినిధులు

ఏలేశ్వరం: పట్టణానికి చెందిన సైంటిఫిక్ ప్రోగ్రాం ఫర్ అకాడమిక్ రీసెర్చ్ క్యూబ్ (స్పార్క్) సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలో గ్రామాల్లో గుడారాలు వేసుకుని నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు దుస్తులు, నిత్యావసర వస్తువులు, చిన్నారులకు తినుబండారాలు, విద్యాసామగ్రి అందజేశారు. జాతీయ రహదారిపై యాచకులు, నిస్సహాయకులకు ఆహార పొట్లాలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. స్పార్క్ ఫౌండేషన్ చైర్మన్ సాయి సందీప్ మాట్లాడుతూ దాతల సహకారంతో సేవా కార్యక్రమాలను విస్తృతం చేసినట్టు చెప్పారు. యువతకు తమ సంస్థ ద్వారా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్పార్క్ సంస్థ ఉపాధ్యాక్షుడు సాయి ప్రదీప్, సభ్యులు సాహుల్, సురేష్, స్వామి, సౌఖ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



కేఈ చిన్నయ్యపాలెంలో రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: మండలంలోని కేఈ చిన్నయ్యపాలెంలో రామాలయ నిర్మాణానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదివారం శంకుస్థాపన చేశారు. లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ ఆధ్వర్యంలో తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ స్వామీజీ శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజాది కార్యక్రమాల్లో మంత్రి రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం ప్రకటించి వెంటనే ఆలయ కమిటీకి అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన మంత్రి దాడిశెట్టి రాజాను లాలం బాబ్జీ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొర్లి రామచంద్రరావు, లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, తుని ఏఎంసీ చైర్మన్ మాకినీడు బాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రాజాను కలసిన డీఎస్పీ లతా కుమారి



మంత్రి దాడిశెట్టి రాజాను మర్యాద పూర్వకంగా కలిసిన డీఎస్పీ లతా కుమారి

తుని: శాంతి భద్రతల పరిరక్షణలో పారదర్శకంగా పని చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సూచించారు. ఆదివారం పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో మంత్రి రాజాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె ఏలూరు జిల్లా పోలవరం సబ్ డివిజన్ పోలీసు అధికారిగా పని చేస్తూ ఇటీవల కాకినాడ జిల్లా పెద్దాపురం డివిజన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని ఆమెకు సూచించారు. తుని పట్టణ సీఐ నాగ దుర్గారావు పాల్గొన్నారు.

తుని రూరల్: తుని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా నియమితులైన పి.విద్యాసాగర్ కుమార్ ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకూ కోటనందూరు ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్యం తుని ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గొల్లప్రోలులో ఈఓపీఆర్‌డీగా పని చేస్తున్న విద్యాసాగర్ కుమార్ తుని ఎంపీడీఓగా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

ఘనంగా వాసవీమాత జయంతి



వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

జగ్గంపేట: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయిత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బొండా వీర సత్య, ఆర్సీ మానేపల్లి బంగార్రాజు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఆర్యవైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

108 కలశాలతో ర్యాలీ

గోకవరం: గ్రామంలో శ్రీవాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళా సంఘం సభ్యులు 108 కలశాలతో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి మొదలుకొని ప్రధాన రహదారిపై వాసవీమాత నామస్మరణతో ర్యాలీ చేపట్టారు. తొలుత వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కొత్తపల్లిలోనూ వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతిని ఘనంగా నిర్వహించారు.

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలి

తుని: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు తగ్గించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు కోరారు. ఆదివారం ప్రజా ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మార్కెట్ యార్డు రైతు బజారులో కూరగాయల దుకాణాలను తనిఖీ చేసి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. కూరగాయలు, హోటల్స్, మాంసం దుకాణాలు, కిరాణా షాపులు తదితర యాజమానులు కవర్లు ప్రజలకు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు ప్లాస్టిక్ బదులు క్లాత్ సంచులను వినియోగించాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజారోగ్యశాఖ అధికారి శేఖర్, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తులకు ఇక్కట్లు

అన్నవరం: సత్యదేవుని కల్యాణ మహోత్సవాల తొలిరోజు ఆదివారం రత్నగిరిపై విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. శనివారం సాయంత్రం అన్నవరంలో ఈదురుగాలులు, వర్షం కారణంగా పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ట్రాన్స్ కో డీఈ సూర్యనారాయణ తెలిపారు. ఉదయం 5.30 గంటల నుంచి 11 గంటల వరకు స్వామివారి ఆలయం, వ్రతమండపాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వ్రతమండపాల్లో మైకులు పనిచేయకపోవడంతో బ్యాటరీ మైకులతో వ్రతాలు నిర్వహించారు. వ్రతాలు ఆచరించే భక్తుల మధ్య తిరుగుతూ పురోహితులు వ్రతకథ వివరించారు. స్వామివారి ఆలయంలో కూడా ఏసీలు పనిచేయకపోవడంతో భక్తులు అవస్థలు పడ్డారు. గోకులం వద్ద వాటర్ ప్లాంట్ కూడా పని చేయలేదు. దీంతో తాగునీటికి భక్తులు ఇబ్బంది పడ్డారు. దేవస్థానం ఏర్పాటు చేసిన చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీతో భక్తులు ఊరట చెందారు. ఉదయం 11 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. భవిష్యత్‌తో ఇటువంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఈఓ చంద్రశేఖర్ అజాద్ విద్యుత్‌శాఖ సిబ్బందిని ఆదేశించారు

మళ్లీ అదే తీరు

సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల ఏర్పాట్లపై దాదాపు నెల రోజుల క్రితం నుంచి ఈఓ చంద్రశేఖర్ అజాద్ తనదైన శైలిలో కసరత్తు చేస్తున్నా సిబ్బందిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. ఫలితంగా ఉత్సవాల తొలిరోజు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని వధూవరులను చేసే కార్యక్రమంలో పసుపు దంచే టప్పుడు ఒక్కసారిగా మహిళలు తోసుకురావడంతో అదుపు చేసేవారు కరువయ్యారు. మహిళలు పసుపు దంచేందుకు పోటీ పడ్డంతో గందరగోళం నెలకొంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కిర్లంపూడి పద్మనాభ ఫంక్షన్ హాల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానిక పద్మనాభ ఫంక్షన్ హాలులో కలుసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలకు వెళ్లి తరగతి గదుల్లో కలియ తిరిగారు. నాడు చేసిన అల్లర్లు, హాస్య సన్నివేశాలను నెమరు వేసుకొని కొంత సమయం చిన్నపిల్లలుగా మారిపోయారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెనగంటి రాజేష్, ఆళ్ల శ్రీమన్నారాయణ, చిక్కాల నరేంద్ర, రౌతు శ్రీను, తోట దుర్గాదేవి, రమ్య, ఉషా, సత్యనారాయణ, తూము రమతులసి, దొడ్డు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో అవస్థలు

తొండంగి: మండల వ్యాప్తంగా ఆదివారం ఓ మోస్తారు వర్షం కురిసింది. రబీ వరి పంటను ఒబ్బిడి చేసుకునే రైతులు ఇబ్బందులు పడ్డారు. మెట్ట, పల్లపు ప్రాంతాల్లో రబీ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. శనివారం కురిసిన కుండపోత వర్షానికి కొన్ని ప్రాంతాల్లో పంటలు తడిసి పోగా ఆదివారం ఉదయం నుంచీ ఆకాశం మేఘావృతమై ఉంది. సాయంత్రం వర్షం కురవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. మరో పది రోజుల్లో రబీ వరి పంట పూర్తిగా ఒబ్బిడి కానున్న నేపథ్యంలో అకాల వర్షాలు నష్టాలను కలిగిస్తున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పుల్లయ్య



ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిట్టంశెట్టి పుల్లయ్య ఎన్నికయ్యారు. స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలోని బార్ కార్యాలయంలో ఆదివారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో చిట్టంశెట్టి పుల్లయ్య ప్యానల్ విజయం సాధించింది. అధ్యక్షుడిగా పుల్లయ్య తన సమీప ప్రత్యర్థి ఆడారి సుగుణపై 24 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. కార్యదర్శిగా బొంగులూరి మధుబాబు తన సమీప ప్రత్యర్థి రాజాల చిట్టిబాబుపై 5 ఓట్లతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా మళ్ల గంగాధర్, కోశాధికారిగా జోన్నాడ అప్పలరాజు తమ సమీప ప్రత్యర్థులపై 16 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. సహాయ కార్యదర్శి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శులుగా రాయి శ్రీనివాసరావు, లింగంపల్లి శివ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో 64 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలకు ఎం.మంజూష, వి.భద్రం, పి. రవికుమార్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. గ్రామాన్ని వ్యర్థ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సర్పంచ్ విజయదుర్గ కోరారు.

నవధాన్యాల సాగుపై అవగాహన



రామవరంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ చేస్తున్న మహిళలు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి, రామవరం గ్రామాల్లో ఆదివారం ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం ఏరియా కోఆర్డినేటర్ సంతోష్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు గ్రామంలో ర్యాలీ చేశారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను సంతోష్ వివరించారు. కిచెన్ గార్డెన్స్, డాబా గార్డెన్స్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి ఇంటికీ నాణ్యమైన కూరగాయాలు అందుబాటులోకి వచ్చి, ఇంటి ఖర్చు తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బొగత అరుణ, పి.దుర్గాప్రసాద్ డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం



కిర్లంపూడిలో వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కిర్లంపూడి: స్థానిక చిల్లంగి శ్రీనివాసనగర్‌లో వేంచేసిన వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేశారు. అనంతరం మహిళల కోలాటం, బాణసంచా కాల్పుల నడుమ స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆరు రోజుల పాటు ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

భక్తులకు మెరుగైన వైద్య సేవలు



దేవస్థానం ఆసుపత్రిలో రక్తదానం చేస్తున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆసుపత్రిలో భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆదేశించారు. దేవస్థానం ఆసుపత్రిలో సంకల్పం, చేయూత, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థలు ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ వైద్యశాల లోపలకు వేడి రాకుండా పైభాగంలో షెడ్డు నిర్మించాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఫార్మసీ రూమ్‌లో మందులు పాడవకుండా ఏసీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్యాధికారి, ఫార్మసీ సూపర్‌వైజర్, ఇతర సిబ్బంది 24 గంటలూ భక్తులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. దేవస్థానం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, ఫార్మసీ సూపర్‌వైజర్ వి.మాధవి, దేవస్థానం ఈఈ నూకరత్నం, డీఈ రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ప్రశంసాపత్రాలు



ఎస్పీ నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న సీఐ సూర్యఅప్పారావు, గండేపల్లి ఎస్సై గణేష్‌కుమార్

గండేపల్లి: జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్‌తో పలు పలువురు సిబ్బంది శనివారం కాకినాడలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఇటీవల కాలంగా జిల్లా వ్యాప్తంగా పలు చోరీలకు పాల్పడిన ఇద్దరు దొంగలను పట్టుకోవడంలో వారి చూపిన ప్రతిభకు గాను ఈ ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు పోలీసు సిబ్బంది తెలిపారు. దీనిలో భాగంగానే హెడ్ కానిస్టేబుల్ జీఎస్ఎన్ మూర్తి (టైసన్), కానిస్టేబుల్ జె.కాశీవిశ్వనాథం, జె.వీరబాబు కూడా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వీరికి స్టేషన్ సిబ్బంది, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

రత్నగిరిపై ఆకట్టుకున్న కళాప్రదర్శనలు



రత్నగిరి ఆలయ ప్రాంగణంలో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు



అనివేటి మండపంలో చేసిన పుష్పాలంకరణ

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా రత్నగిరిపై ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారిని వధూవరులను చేసే కార్యక్రమం, పలు ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు ప్రదర్శించిన కోలాటం, స్వామి, అమ్మవార్ల ఊరేగింపు, అనివేటి మండపంలో చేసిన అలంకరణ అందరినీ విశేషంగా అలరించాయి. విశ్రాంత దేవస్థానం అధికారి పోల్నాటి గోవిందరావు సత్యదేవుని వైభవంపై ప్రసంగం చేశారు. చిన్నారుల నృత్యప్రదర్శనలతో అలరించారు.